
తిలక్‌నగర్ గల్లీలో నుంచి ఫ్లైఓవర్ వైపు వెళ్లే దారిలో ఎత్తుగా వేసిన ఫ్లైఓవర్ రోడ్డు


శ్రీరమణ చౌరస్తా వద్ద ఫ్లైఓవర్ రోడ్డుకు కింది ప్రాంతంగా మారిన పోచమ్మ బస్తీకి వెళ్లే ప్రాంతం

ఇబ్బందులు తొలగించడానికా.. సృష్టించడానికా..?

- ఫ్లైఓవర్ కింది రోడ్డు ఎత్తుగా నిర్మించడంతో లోతట్టు ప్రాంతాలుగా పరిసర బస్తీలు, కాలనీలు
- వర్షపు నీరు వెళ్లకుండా నిర్మించడంపై స్థానికుల ఆగ్రహం

అంబర్‌పేట: ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు నిర్మిస్తున్న ఫ్లైఓవర్ మరిన్నీ ఇబ్బందులను సృష్టించేలా ఉంది. అంబర్‌పేటలో వరంగల్ జాతీయ రహదారిపై నిర్మిస్తున్న ఫ్లైఓవర్‌తో స్థానికులకు కొత్త కష్టాలు తెచ్చిపెడుతోంది. 1.5 కిలోమీటర్ల మేర నిర్మించే ఫ్లైఓవర్ ప్రాంతాల్లో ఉన్న పలు బస్తీలు, కాలనీలు, వర్షపు నీటి ముంపుకు గురై ప్రమాదం ఉంది. గోల్నాక చర్చ్ నుంచి ఛే-నంబర్ చౌరస్తా, శ్రీరమణ చౌరస్తాల మీదుగా ఇరానీ హోటల్ వరకు నిర్మించే ఫ్లైఓవర్ ఇరువైపులా పలు ప్రాంతాలు లోతట్టు ప్రాంతాలుగా తయారవుతున్నాయి.

శాస్త్రీయ ప్రమాణాలు పాటించకుండా..

ఫ్లైఓవర్ కింది రోడ్డు శాస్త్రీయంగా నిర్మించకపోవడంతో ఆయా ప్రాంతాలకు వెళ్లే రోడ్డులు లోతట్టు ప్రాంతాలుగా మారాయి. బ్రిడ్జ్ కింద నిర్మిస్తున్న రోడ్డు ఎత్తుగా నిర్మిస్తుండటంతో ఫ్లైఓవర్ పరిసర ప్రాంతాలు అన్ని లోతట్టు ప్రాంతాలుగా మారుతున్నాయి. ఫ్లైఓవర్ కింద శాస్త్రీయ ప్రమాణాలు పాటించకుండా ఎత్తుగా రోడ్డు నిర్మిస్తుండటంతో తలెత్తె సమస్య జీవిత కాలం ఉండే అవకాశం లేకపోలేదు. నిర్మాణ దశలోనే అన్నీ సమస్యలను దృష్టిలో ఉంచుకొని నిర్మాణదారులు రోడ్డు ఎత్తుకకుండా నిర్మించాలని పలువురు కోరుతున్నారు. ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్ ఎత్తుగా నిర్మించడంతో వాహనదారులు సహితం అవస్థలు పడుతున్నారు. తిలక్‌నగర్ రోడ్డు, సల్వా గార్డెన్, ఛే-నంబర్ బాటా షోరూం, షెర్టాన్ హోటల్ ఎదురు లైన్, ఖాద్రీ బాగ్, శ్రీరమణ చౌరస్తా, బురుజు గల్లీ, ప్రాంతాలు లోతట్టుగా మారిపోతున్నాయి.

వర్షపు నీరు వెళ్లని పరిస్థితి..

చిన్నపాటి వర్షం వస్తే ఫ్లైఓవర్ కింద నిర్మించిన రోడ్డు ఎత్తుగా ఉండడంతో జనవాసాల నుంచి వచ్చే నీరు వెళ్లే దారిలేదు. వర్షపు నీరు భారీగా వస్తే పరిసరా ప్రాంతాల్లోని నివాసాల్లోకి వెళ్లి ముంపునకు గురవుతాయి. వర్షపు నీటికి దారిలేకుండా కనీస ఇంజినీరింగ్ ప్రమాణాలు పాటించకుండా నిర్మించడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫ్లైఓవర్ కింద ఉన్న ప్రాంతాలన్నీ వర్షపు నీటి ముంపు బారిన పడే ప్రమాదం ఉంది. కొన్ని ప్రాంతాల్లో వర్షపు నీరు వెళ్లేందుకు నాలాలు కూడా లేవు. ఇలాంటి తీవ్ర సమస్యను ఫ్లైఓవర్ నిర్మాణదారులు పట్టించుకోకపోవడం దారుణం. ఇప్పటికైనా ఫ్లైఓవర్ నిర్మాణదారులు భవిష్యత్తులో స్థానికులకు ఇబ్బందులు తలెత్తకుండా పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మాకు సంబంధం లేదు
ఆర్అండ్‌బీ ఈఈ ధర్మారెడ్డి

ఫ్లైఓవర్ కింద నిర్మించే రోడ్డుపై నీరు నిలవకుండా చూసుకోవడం వరకే తమ బాధ్యతని చెప్పారు. జనవాసాల నుంచి వచ్చే నీటికి తమ బాధ్యత కాదన్నారు. అది జీహెచ్‌ఎంసీ విభాగం చూసుకుంటుందని తెలిపారు. వర్షపు నీరు వెళ్లేందుకు దారిలేని ప్రాంతాల్లో ఎలా అంటే తమకు తెలియదని ఆయన చెప్పారు. నీటికి అడ్డంగా ఎత్తుగా రోడ్డు వేసి ముంపునకు గురి చేస్తారా? అని అడిగితే అది కూడా జీహెచ్‌ఎంసీనే చూసుకుంటుందని పేర్కొన్నారు.


లోతట్టు ప్రాంతంగా మారిన బురుజు గల్లీ వెళ్లే మార్గం

కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేశాం

బీఆర్‌టీయూ అధ్యక్షుడు రాంబాబు యాదవ్


జేసీఎల్‌కు నామినేషన్ పత్రాలను అందజేస్తున్న రాంబాబు యాదవ్, మల్లయ్యయాదవ్

చిక్కడపల్లి: కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేశామని.. కార్మికులకు ఇచ్చిన హామీ అమలు చేశామని వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ తెలంగాణ (డబ్ల్యూడబ్ల్యూఈయూటీ) అధ్యక్షుడు, బీఆర్‌టీయూ అధ్యక్షుడు రాంబాబు యాదవ్ అన్నారు. వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ (2873) యూనియన్ గుర్తింపు ఎన్నికలకు గాను యూనియన్ అధ్యక్షుడిగా రాంబాబు యాదవ్, ప్రధాన కార్యదర్శిగా ఎం.మల్లయ్యలు గురువారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని కార్మిక శాఖ కార్యాలయంలో జంటనగరాల సంయుక్త కార్మిక కమిషనర్ సునీత గోపాల్‌దాస్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు.

◆ ఈ సందర్భంగా రాంబాబుయాదవ్ మాట్లాడుతూ... ఎమ్మెల్సీ కవిత, గౌరవ అధ్యక్షుడు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సారథ్యంలో రెండుసార్లు గెలిచి కార్మికులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామని పేర్కొన్నారు.కాంగ్రెస్ అనుబంధ యూనియన్ నేడు కార్మికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని మండిపడ్డారు. కార్మికులకు హెల్త్ కార్డు, ప్రమోషన్ల సమస్య, పీఆర్‌ఎస్ ధర్నాలకు లేకుండా సాధించుకున్నామని తెలిపారు. అక్రమ ట్రాన్స్‌ఫర్లకు అడ్డుకట్ట వేశామన్నారు. అందుకే మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జి.లక్ష్మీనారాయణ, మేడ్చల్ శ్రీనివాస్, కోకాపేట జంగయ్య, జమీల్ అహ్మద్, రాచంద్రరెడ్డి, వెంకటేశ్ యాదవ్, కిషన్, జ్ఞానేశ్వర్, రాజ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, ఉదయ్, కుమార్, రామస్వామి, నిరంజన్, శివారెడ్డి, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

కార్మిక పక్షపాతి రాజేంద్రబాబు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: కార్మిక పక్షపాతి రాజేంద్రబాబు అని ఎల్‌ఐసీలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఆయన ఎంతగానో కృషిచేశారని పలువురు వక్తలు కొనియాడారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎల్‌ఐసీ డవలప్‌మెంట్ ఆఫీసర్ రాజేంద్రబాబు సంతాప సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్త చలసాని ప్రసాద్, ఆలిండియా ఎల్‌ఐసీ యూనియన్ నాయకులు బి.రాంకుమార్, ఎల్‌ఐసీ హైదరాబాద్ డివిజన్ అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ప్రతాప్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా రాజేంద్రబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శిగా ఉండి అనేక సేవలు అందించారన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కాచిగూడ: ఎంఎంటీఎస్ రైలు ఎక్కుతూ ప్రమాదవశాత్తు కిందపడి గాయపడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... కాచిగూడ ప్రాంతానికి చెందిన గుమ్మడి సాయిబాబా(64) ఉప్పుగూడలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. బుధవారం ఉప్పుగూడ రైల్వేస్టేషన్‌లో ఎంఎంటీఎస్ రైలు ఎక్కుతుండగా కిందపడి గాయపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందడంతో రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: కొన్ని రోజులుగా సీతాఫల్‌మండి రైల్వేస్టేషన్‌లో ఉంటున్న ఓ గుర్తుతెలియని వ్యక్తి (38) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడని కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

7న ఆటో బంద్‌ను విరమించుకోవాలి


నారాయణగూడలో మీడియాతో మాట్లాడుతున్న రుద్రాక్ష, మల్లేష్ తదితరులు

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 7న తలపెట్టిన బంద్‌ను ఆటో డ్రైవర్లు విరమించుకోవాలని ఆఖిల భారత అసంఘటిత కార్మికుల ఉద్యోగుల కాంగ్రెస్ (కేకేసీ) రాష్ట్ర కార్యదర్శి రుద్రాక్ష మల్లేష్, జనరల్ యూనిటీ ఫర్ తెలంగాణ సంఘం (గట్స్) రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. గురువారం నారాయణగూడలో వారు మీడియాతో మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్ల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారానికి కేకేసీ, గట్స్ యూనియన్ల ప్రతినిధులు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. మంత్రి స్పందిస్తూ ఆటో డ్రైవర్ల సమస్యలు తీర్చడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఆటో మీటర్ చార్జీల పెంపుదల, పర్మిట్లపై రాష్ట్ర సీఎం సంబంధిత అధికారులతో చర్చించి త్వరలోనే ఆటో డ్రైవర్లకు తీపి కబురు చెబుతారని హామీ ఇచ్చారని తెలిపారు. ఆటో డ్రైవర్ సోదరులు ప్రతిపక్ష పార్టీల యూనియన్ నేతల మాటలు నమ్మి బంద్‌లో పాల్గొనవద్దని కోరారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించకుండా మోసం చేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కేకేసీ నగర ప్రధాన కార్యదర్శి బి.సత్యనారాయణ గౌడ్, కుమార్, ఎండీ ఫారుక్, జైశరత్ కుమార్, ఎండీ అనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

కులగణనకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయండి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం



కాచిగూడ: కులగణన నమోదుకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కాచిగూడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో సమగ్ర కులగణన సర్వే 100 శాతం పూర్తి చేయడానికి ప్రభుత్వం మరో వారం రోజులు గడువు పెంచాలన్నారు. ఇప్పటి వరకు అనివార్య కారణాల వలన కులగణన సర్వేలో పాల్గొనని వారికి ప్రత్యేకించి స్థిరనివాసం లేని సంచార జాతులకు కులగణన నమోదుకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు.

అధికారులు తప్పుడు సమాచారం ఇస్తున్నారు..

ఇప్పటికే 17 జిల్లాల్లో 100 శాతం సర్వే పూర్తయిందని.. ప్రభుత్వానికి జిల్లా అధికారులు తప్పుడు సమాచారం ఇస్తున్నారని అన్నారు. జీవనోపాధి కోసం వలస పోయిన వారిని అలాగే ఆధార్, రేషన్‌కార్డు, స్థిర నివాసం లేనటువంటి 56 కులాల సంచార జాతులకు ఇప్పటి వరకు సర్వే జరగలేదన్నారు. అలాంటప్పుడు 100 శాతం సర్వే పూర్తయిందని ఎలా ప్రభుత్వానికి నివేదిక ఇస్తారని ఆయన ప్రశ్నించారు.

సర్వే దేశానికే రోల్‌మోడల్‌గా ఉండాలి..

రాష్ట్రంలో ఇప్పటి వరకు కుటుంబాలను గుర్తించి ఇంటికి స్టిక్కరింగ్ వేసిన వారికే సర్వే పూర్తి కాలేదన్నారు. అసలు ఇల్లు కూడా లేని వారికి స్టిక్కరింగ్ వేయని వారికి సర్వే నిర్వహించలేదన్నారు. హైదరాబాద్‌లో ఇప్పటికీ 70 శాతం మాత్రమే సర్వే పూర్తయ్యిందన్నారు. ఇంకా 30శాతం సర్వే పూర్తి కావాల్సి ఉందన్నారు. కుల గణన సర్వే సంపూర్ణంగా విజయవంతంగా జరగాలంటే రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. తెలంగాణలో జరిగే కులగణన రేపు భవిష్యత్‌లో దేశానికి రోల్‌మోడల్‌గా ఉండాలని ఆకాంక్షించారు.

మనిషి గొప్పదనాన్ని చాటేది సేవే..


కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికురాలిని సత్కరిస్తున్న అతిథులు

అంబర్‌పేట: సామాజిక సేవా భావం మనిషి గొప్పదనాన్ని చాటుతోందని ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ జె.నర్సయ్య అన్నారు. గురువారం అంతర్జాతీయ స్వచ్ఛంద సేవా దినోత్సవాన్ని పురస్కరించుకొని సేవా యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రచ్చ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు అభినందన కార్యక్రమం గోల్నాకలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఈస్ట్ జోన్ డీసీపీ నర్సయ్య, మాల్కజ్‌గిరి అడిషినల్ డీసీపీ వెంకటరమణ, హైకోర్టు న్యాయవాది జీఎల్ నరసింహరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ హేమాలతలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నర్సయ్య మాట్లాడుతూ... పారిశుద్ధ్య కార్మికులు క్షేత్ర స్థాయిలో నిత్యం అందించే సేవాలు ఎంతో అభినందనీయమని అన్నారు. సామాజిక సేవా భావాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాల్సిన అవసరం ఉందని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సేవా యూత్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రవీణ్, పాండురంగం, కార్మికులు పాల్గొన్నారు.

హామీలను విస్మరించి విజయోత్సవాలా.?

సెంట్రల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు


కాచిగూడలో నిర్వహించిన బీజేపీ బహిరంగ సభలో మాట్లాడుతున్న డాక్టర్ ఎన్.గౌతంరావు

కాచిగూడ: ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క గ్యారంటీని కూడా అమలు చేయలేదని హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు అన్నారు. 6 గ్యారంటీలు, 66 మోసాలు, 420 వాగ్దానాలు చేసి ప్రజలను మభ్యపెట్టి ఎన్నికల్లో విజయం సాధించి ఏడాది పూర్తి చేసుకున్నా హామీలను అమలు చేయడంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ బీజేపీ అంబర్‌పేట నియోజకవర్గం ఆధ్వర్యంలో గురువారం చెప్పల్‌బజార్‌లో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణతో కలిసి ఆయన మాట్లాడారు.

గద్దె దించే రోజులు దగ్గరపడ్డాయి..

◆ కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనలో అన్ని వైఫల్యాలేనని, ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా విజయోత్సవాలు జరుపుకోవడం సిగ్గు చేటని ధ్వజమెత్తారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ప్రజలను వంచించడంలో రెండూ ఆరితేరాయని విమర్శించారు. గత ప్రభుత్వం లాగానే ఈ ప్రభుత్వాన్ని కూడా గద్దె దించే రోజులు దగ్గరపడ్డాయని పేర్కొన్నారు. నాటి బీఆర్‌ఎస్, నేటి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమాత్రం తేడా లేదన్నారు.

ప్రభుత్వాలు మారాయే తప్ప మార్పు రాలేదు..

పార్టీ వైఫల్యాలను తప్పుదోవ పట్టించేందుకే మూసీ నది సుందరీకరణ అంశాన్ని తెరమీదకు తెచ్చారని ఆరోపించారు. ప్రభుత్వాలు మారాయే తప్ప పాలనలో మాత్రం మార్పు రాలేదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు మాజీ మంత్రి సి.కృష్ణయాదవ్, ఆనంద్‌గౌడ్, సి.నందకిషోర్ యాదవ్, శ్యామ్‌రాజ్, ఎ.సూర్య ప్రకాష్ సింగ్, సి.వినోద్ యాదవ్, కన్నె ఉమా రమేష్ యాదవ్, వై.అమృత, డాక్టర్ సమత, వనం రమేష్, ఎడెల్లి అజయ్ కుమార్, కేసరి నర్సింగ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టాలి

కవాడిగూడ: ప్రపంచ వ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టేందుకు ఐక్యంగా ఉద్యమించాలని పలు మహిళా సంఘాల నేతలు పిలుపునిచ్చారు. మహిలలపై దాడులు, అత్యాచారాలు, హత్యలను అరికట్టేందుకు నిందితులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గురువారం లోయర్ ట్యాంక్ బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద చైతన్య మహిళా సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా చైతన్య మహిళా సంఘం నేతలు అరుణ, శ్రీదేవి, సత్య, జయ, గిరిజ, సవిత, తిరుమల, విరసం నేతలు సత్యం, జయ పాల్గొని ప్రసంగించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మహిళలపై రోజు రోజుకు పెరిగిపోతున్న హింసలను అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పలు మహిళా సంఘాల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు అన్నారు.


లోయర్ ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న చైతన్య మహిళా సంఘం నేతలు

నర్ల సురేష్‌కు ఉత్తమ సేవా పురస్కారం

అల్వాల్: మచ్చబొల్లారంలోని సురేష్ సేవా సమితి వ్యవస్థాపకుడు నర్ల సురేష్ ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్నారు. పినాకిని యూత్ వెల్ఫేర్ చేస్తున్న సేవలను గుర్తించి ఆయన గురువారం త్యాగరాయ గానసభలో అంతర్జాతీయ స్వచ్ఛంద సేవకుల దినోత్సవం నిర్వహించారు. కేంద్ర మాజీ మంత్రి ఎస్.వేణుగోపాలాచారి, రిటైర్డ్ జడ్జి మధుసూదన్‌రావు ముఖ్యఅతిథులుగా హాజరై ఆయనకు పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాధా కుసుమ, మురళీమోహన్‌రాజు, చంద్రశేఖర్, వివిధ సేవా సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలి

అంబర్‌పేట: విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని బేగంపేట ట్రాఫిక్ శిక్షణ కేంద్రం ఏసీపీ ఎస్.వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం డీడీకాలనీలోని హోటల్ మేనేజిమెంట్ కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే మన భద్రతతో పాటు ఇతరులకు ఇబ్బందులు సృష్టించకుండా ఉండవచ్చన్నారు. ర్యాష్ డ్రైవింగ్, డ్రంకన్ డ్రైవ్‌కి పాల్పడితే ఇబ్బందులు తప్పవని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే భారీ జరిమానాలు తప్పవని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ అధికారులు రాంచందర్, లెనిన్‌బాబు, ఎస్సై వీరమల్లయ్య, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

జేవీ.రాముడుకు పీఎల్ సంజీవారెడ్డి స్మారక పురస్కారం

చిక్కడపల్లి: పీఎల్ సంజీవరెడ్డి నిస్వార్థ సేవా పరాయుడని తమిళనాడు మాజీ గవర్నర్ పీఎస్ రామ్మోహన్‌రావు అన్నారు. రసమయి సాంస్కృతి సంస్థ ఆధ్వర్యంలో గురువారం రాత్రి త్యాగరాయ గానసభలో పీఎల్ సంజీవారెడ్డి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బసవతారకం కేన్సర్ ఆస్పత్రి ఏర్పాటులో ఆయన ప్రముఖ పాత్ర పోషించారన్నారు. ఆంధ్రప్రదేశ్ తొలి డీజీపీ జేవీ.రాముడుకు ఈ సందర్భంగా పీఎల్ సంజీవారెడ్డి స్మారక పురస్కారాన్ని ప్రదానం చేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, ప్రముఖ సాహితీవేత్త ఆచార్య కొలకలూరి ఇనాక్, నర్సింహప్ప, తదితరులు పాల్గొన్నారు.

తొక్కిసలాటకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలి

చిక్కడపల్లి: సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాటలో మృతి చెందిన రేవతి మృతికి కారణమైన వారిపై చట్టరీత్యా కేసులు నమోదు చేయాలని గురువారం ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విజయ్ మల్లంగి, మహిళా సంఘం రాష్ట్ర ప్రదాన కార్యదర్శి అడ్వకేట్ యమునాగౌడ్ చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సినీనటుడు అల్లు అర్జున్ రావడంతో తొక్కిసలాట జరిగిందని రేవతి మరణానికి ఆయన కారణమయ్యారని ఆరోపించారు. పోలీసులు బందోబస్తులో విఫలం అయ్యారన్నారు. థియేటర్ యాజమాన్యం రక్షణ చర్యలు తీసుకోకుండా సెలబ్రిటీలను పిలిచి తొక్కిసలాటకు కారణమయ్యారని పేర్కొన్నారు. దీనికి కారకులైన వారిపై కేసు నమోదు చేసి శిక్షించాలని వారు కోరారు. మృతురాలి కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

◆ **సమగ్ర నాయ్య విచారణ జరిపించాలి..**

బీసీ సంక్షేమ సంఘం జాతీయ మహిళా ఉపాధ్యక్షురాలు మట్ట జయంతిగౌడ్ మాట్లాడుతూ.. తొక్కిసలాటలో ఒకే కుటుంబానికి చెందిన రేవతి అనే మహిళ ప్రాణాలు కోల్పోయి అతని కుమారుడు తీవ్రంగా గాయపడి ప్రాణాపాయస్థిలో ఉండడం చాలా బాధకరమని అన్నారు. తొక్కిలాటపై సమగ్ర నాయ్య విచారణ జరిపించాలని దీనికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మురుగు సమస్య పరిష్కారానికి కృషి

అంబర్‌పేట: ఉస్మానియా యూనివర్సిటీ ప్రాంతం నుంచి వచ్చే మురుగు నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు బాగ్అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మా వెంకట్‌రెడ్డి తెలిపారు. యూనివర్సిటీ ఆటవి ప్రాంతం నుంచి మురుగు నీరు డివిజన్‌లోని మల్లికార్జుననగర్, రహత్‌నగర్‌లోని ప్రాంతాలోకి రావడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దీంతో గురువారం యూనివర్సిటీ ఆధికారుల దృష్టికి తీసుకెళ్లి క్షేత్రస్థాయిలో సమస్యలు పరిశీలించారు. మురుగునీటి సమస్యను తక్షణమే ఆరికట్టాలని కార్పొరేటర్ యూనివర్సిటీ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ అధికారులతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు బి.వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేరి నాగేశ్వర్‌రావుకు ఘంటసాల జీవన సాఫల్య పురస్కారం



చిక్కడపల్లి: ఘంటసాల పాటల అనుకరణలో మెటి పేరి నాగేశ్వర్‌రావు అని ప్రముఖ గాయకుడు త్రినాథరావు ప్రశంసించారు. గురువారం త్యాగరాయ గానసభలో భారత్ ఆర్ట్స్ అకాడమీ ఏబీసీ ఫౌండేషన్ నిర్వహణలో ఘంటసాల జీవన సాఫల్య పురస్కారం ప్రదానోత్సవం సభ జరిగింది. ఈ సందర్భంగా కేవీ రమణారావు, త్రినాథరావు ఆయనకు పురస్కారం ప్రదానం చేసి మాట్లాడారు. చాలా మంది గాయకులు ఘంటసాల పాటలు పాడుతూనే వున్నా నాగేశ్వర్‌రావు గళం విభిన్నమని అన్నారు.

ఆధ్యాత్మిక భావనను అలవర్చుకోవాలి


మహా పడిపూజ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న సినీహీరో నరేష్

ముషీరాబాద్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావనను అలవర్చుకోవాలని ప్రముఖ సినీహీరో నరేష్ అన్నారు. గురువారం ముషీరాబాద్‌కు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు నక్క శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీన ముషీరాబాద్ డివిజన్ సెయింట్‌పాయిస్ స్కూల్ సమీపంలో నిర్వహించే 36వ అయ్యప్ప మహాపడి పూజ బ్రోచర్‌ను ప్రముఖ సినీ హీరో నరేష్ ఆవిష్కరించారు. నక్క శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. 36 సంవత్సరాలుగా అయ్యప్పస్వామి మహాపడిపూజ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పూజకు హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, ముఠా జైసింహ హాజరవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేందర్‌బాబుగౌడ్, అర్.శ్రీనివాస్, సురేష్ పాల్గొన్నారు.